# సంపాదకీయం

## కారంచేడు!

కిల్వేన్మణి, కంచికచెర్ల, బెల్చి, పిప్రా, పారస్‌భీగా, పదిరి కుప్పం, ఇప్పుడు కారంచేడు- ఇలా ఇంకా ఎన్ని నరమేధాలు జరగాలి? కూలివాళ్ళయిన పాపానికి ఇంకా ఎందరు నిర్భాగ్యులు బలికావాలి? "అభివృద్ధి" వాళ్ళకోసమే అన్నారు. అది వాళ్ళకు అందకపోగా బలిసినవాళ్ళను మరింత బలిపించింది. ఆస్తిపరులలో మరింత ఆస్తి దాహాన్నీ అధికార దాహాన్నీ కలిగించింది. వాగ్దానం చేసిన అభివృద్ధి అందకపోగా ఈ అహంకారపు దాహం యొక్క రాక్షసత్వాన్ని కూలి జనం చవిచూస్తున్నారు. ఇళ్ళు తగలబెట్టి ఇళ్ళలోని వాళ్ళను సజీవ దహనం చేస్తున్నారు గొడ్డళ్ళతోనరికి బరిసెలతో కుళ్ళబొడుస్తున్నారు. కారంచేడు మారణకాండ వాస్తవాలు వింటే (లోపలి పేజీలలో రిపోర్టు చూడండి) అది మనుష్యుల పనా లేక క్రూరమృగాలవేటా అని అనుమానం వస్తుంది.

తాము ఇచ్చిన కూలికి పనిచేయాలి. రోగం వచ్చినా చావే వచ్చినా ఒక్కనాడు కూడా పని మానడానికి వీలులేదు. పొలాల్ని మధ్యలో పని మానుకొనిపోతే చేసిన శ్రమ అంతా బూడిదలో పోసా మనుకొని ఒక్క పైసాగూడ అడగకుండ వెళ్ళిపోవాలి. పంటమొత్తం భూస్వామి ఇంటికి చేరేదాకా పాలేరుకు జీతంముట్టదు పైగా తాము ఏ పార్టీకి ఓటు వేస్తే కూలివాళ్ళూ అదేపార్టీకి వేయాలి. ఈ నియమాలు తప్పితే చంపుతారు. ఇవంట, కారంచేడు గ్రామాన్ని నడిపించే ధర్మసూత్రాలు వీటికి భారత రాజ్యాంగం కంటె రెండువేల ఏళ్ళనాడు పరమకర్కోటకుడు మనువు రాసిన ధర్మసూత్రాలతో పోలిక ఎక్కువ. అది భారత రాజ్యాంగం తప్పేనంటారుకాబోలు. నిజానికి అదే భారత రాజ్యాంగం గొప్పతనం. తన శాసనాలకూ అవి శాసించే సమాజానికీ పొంతన ఉండాలనే నియమం ఆ ఉద్గ్రంధానికిలేదు. వెట్టిచాకిరీని రద్దుచేసింది. అభిప్రాయ స్వేచ్ఛను (అందులో భాగంగా వోటింగ్ స్వేచ్ఛను) గుర్తించింది. కనీసవేతన చట్టాలు చేసింది. మాలమాదిగలపై జరిగే అత్యాచారాలను ప్రత్యేకమయిన నేరాలుగా పరిగణించే పౌరసత్వ హక్కుల చట్టాన్ని చేసింది. అన్నీ చేసిందిగాని వీటిని భూస్వాములు తిరస్కరిస్తే, ఆ తిరస్కరించిన వాళ్ళను శిక్షించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తే అప్పుడేం చేయాలో ప్రజలకు చెప్పలేదు. ప్రజలు ఏమయినా చేస్తే మాత్రం టెర్రరిస్టు చట్టం తయారుచేసుకొమ్మని ప్రభుత్వానికి చెప్పింది

మూడువేల మంది మూకుమ్మడిగా దాడిచేస్తే 22 మందినే ఆరెస్టు చేశారు ఇప్పటిదాకా మూడువేల మంది చేతులలోకి ఒక్కసారిగా అకస్మాత్తుగా బరిసెలూ గొడ్డళ్ళూ రావుకాబట్టి ఇందులో కుట్ర (I P C సెక్షన్ 120) ఉందేమో ఆలోచించారా అని ప్రకాశం జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌ను అడిగితే 'మాకు మీ సలహా అక్కరలేదంటాడు. ఇప్పటికి చనిపోయిన 6 మందికాక ఇంకా 10 మంది జాడ తెలియడంలేదు కదా, మరి శవాలకోసం వెతుకుతున్నారా అంటే శవాలు ఎక్కడయినా పడివుంటే గద్దలూ రాబందులవలన తెలుస్తుందనీ కాబట్టి ప్రత్యేకించి వెతకనక్కరలేదనీ అంటాడు. మీరుగాని మీ గద్దలూ రాబందులూగాని చూపించకుండా జనమే తమవారి శవాలను వెతికి మీ దృష్టికి తెచ్చారుగదా అది మీ వైఫల్యాన్ని సూచించదా అంటే మీరు నన్ను "ఇన్సల్ట్" చేస్తున్నారంటాడు.

3000 మంది దాడిచేస్తే కొద్దిమందినే అరెస్టు చేశారేమండే "అందరినీ తీసుకొచ్చి పోలిస్‌స్టేషన్‌లోపెట్టి కొట్టమంటారా?" అని చాలాతెలివిగా ఎదురుప్రశ్న వేస్తాడు. కొట్టమని మేము అనడంలేదు. ఎంత దుర్మార్గులనయినా పోలీసులు చిత్రహింసలకు గురిచేసి సంస్కరించాలని మేము భావించము. పోలీసు యంత్రాంగం ద్వారా సమాజాన్ని సంస్కరించాలనుకోవడం మూర్ఖత్వం. అయితే ఇదే భూస్వాములు కూలివాళ్ళమీద కాక కూలివాళ్ళు భూస్వాములమీద దాడిచేసి ఆరుగురినికాదు అందులో సగం మందిని చంపివున్నా ఎంత భీభత్సం జరిగి ఉండేది? మొత్తం మాల మాదిగ పల్లెలను "రౌండప్" చేసి చర్మం ఒలిచి వుండేవారు కాదా?

అయినా ఇది అరెస్టులతో కాని కేసులతోగాని పరిష్కారమయ్యే సమస్యకాదు. ఒకవేళ అరెస్టుచేసి కేసు పెట్టినా కోర్టులో భూస్వాములకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వగల ధీరులెవ్వరు? ఆ భూస్వాములు ముఖ్యమంత్రికి స్వయంగా చుట్టాలయినప్పుడు వాళ్ళకు శిక్ష వేయగల ధీరులుమాత్రం ఎవ్వరు? "ఎదురుకాల్పుల'ను రొటీన్ విషయాలని వసంతనాగేశ్వరరావు తెగించి అన్నాడుగాని ఈ మాల మాదిగల వధ మాత్రం మన భారత భూమికి రొటీన్ విషయంకాదా? కాంగ్రెస్‌వాళ్ళు ఆంధ్రలో జరిగే హరిజన వధ గురించి అన్యాయం అన్యాయమంటే వసంతనాగేశ్వరరావు ఉత్తరప్రదేశ్‌లో మీవాళ్ళ మాట ఏమిటంటాడు కారంచేడును జనతా నాయకులు సందర్శిస్తే అప్పట్లో బెల్చిలో మీ వాళ్ళు చేసిందేమిటని అడుగుతాడు. ఈ పరస్పర ఆరోపణలలో అసలు విషయం బయటపడుతుంది. ఇవి కులం తగాదాలు కావు. కమ్మలో రెడ్లో రాజపుత్రులో భూమిహార్‌లో చేస్తున్న హత్యలుకావు ఇవి ధనం ఆస్తి అధికారం తెచ్చిన మదంవల్ల జరుగుతున్న హత్యలు ధనికులను మరింత ధనికులను చేసే ప్రగతి పంధలోకి దేశం ఇలా పయనిస్తూనే వుంటే ఇటువంటి హత్యలు మరిన్ని జరుగుతుంటాయే తప్ప ఆగిపోవు